

# ఆ తొలి చూపు

శ్రీ దుర్గంపూడి సోమరాజు

౧

మోహానుని తల్లి తండ్రులు చిన్నతనమునందే కరవగుట వలన పెదతండ్రి కొడుకగు కేశవుడు మోహానుని, మోహానుకి చెల్లెలగు సుశీలను తన యింటియందే పెంచుచు మోహానుని ఎం. ఏ. వరకు చదివించెను. మోహానుని దురదృష్టము కొలది కేశవుడుకూడ అకాలమరణము పాలగుటవలనను, కోపభూయిష్టులగు పెదతల్లి, వదెనగారగు ప్రమద యొక్క కోపానలములకును, సూటిపోటి మాటలకును సహింపజాలక జీవనోపాధికి వేరొక త్రోవ జూచుకొను నవసరము కలిగెను. దయామయుడగు సోదరుడు కేశవు డున్నంతవర కిట్టి కష్టములకు లోనుగాకుండ, అతి గారాబముతోడ పెరిగిన మోహానునకు, సుశీలకు, యిప్పు డట్టి గృహమున, క్షణకాల మయిన నివసించుటకు మనసొప్పుటలేదు. ఎంత ప్రయత్నించినను గవర్నమెంటు ఆఫీసులలోనేగాక, వణిజుల వద్ద గుమాస్తా పనియైన దొరకుట మోహాన్ వంటి ఎం.ఏ.కు దుర్లభ మయ్యెను. మోహానునకు పత్రికలు చదువుటయందు ప్రీతిమెండు వ్యాసములు వ్రాయుటయం దధికోత్సాహము కలిగి ఎన్ని వ్యాసములు వ్రాసి పంపినప్పటికి పత్రికాధిపతులు నాటిని స్వీకరింపరయ్యె. ఏ పనులు ప్రారంభించినను విఫలములగుట వలన, నిరుత్సాహుడై మోహాన్ వొక దినమున మంచముపైబడి తన దురదృష్టమునకు చాలరాత్రివరకు విచారించుచు విచారించుచు గాఢనిద్ర చెంది మరుచటి ఉదయము ఎనిమిది గంటలవరకు లేవలేదు. అప్పుడు పెదతల్లియు, వదెనగారును వచ్చి—"యీ దొరగారిని చూడు, ప్రమదా! లార్డుగారికి యింకను తెల్లవారలేదు." అను మాటలు వినుటయే తడవుగ ప్రమద మండిపడుచు "వారికి వేళతో పని ఏమి? పండుకోననిండు. కష్టపడి ఎమ్. ఏ. పూర్తిచేసిన దొర యింతసేపు పండుకొనవద్దా? ఏమి చూచుకొనియో ఈయన కింత గర్వము? నాలుగు ఇంగ్లీషుముక్కలు చదివినాడో లేదో తానొక కలెక్టరువలె తలచుకొనుచున్నాడు!!" అన్నది. పాపము! సుశీల అశ్రుపూరితములగు నేత్రములతో డిల్లపోయి, వారు సోదరుని గురించి పలికెడు కఠినవాక్యములకు తహతహలాడుచు,

చేయునదిలేక తమ ఆ స్థితికి విచారించుచు దీనవదనయై వారివంక చూచుచు నిలబడి పోయెను.

ప్రమద—"లజ్జలేదు, గర్వమెక్కువ, అన్నగారి ధర్మమువలన ఎమ్. ఏ. చదివించినారు. దమ్మిడీజీతము సంపాదించలేని మనిషి యీరీతి సోమరియై తిని తిరుగు చున్న మన మెంతకాలము పోషింపగలము."

పెదతల్లి—"ప్రమదా!, చిన్నతనమునందు తల్లి తండ్రులు గతించినవాళ్ళు యిట్లేయుందురు. కొంచెము కష్టసుఖములు అనుభవించిన పిమ్మటగాని సరియగు త్రోవకు రారు. అది వారల కర్మము. అందులకు నీవు విచారింపవలసిన పనిలేదు.

ప్రమద మండిపడుచు—"చావనిండు—బ్రతుక నిండు,నాకేమి?" అనుచు అచ్చటినుండి వెడలిపోయెను.

సుశీల యీమాటలను సహింపజాలక వెక్కి వెక్కి ఏడువసాగెను. మోహన్ ఒకప్రక్కగా దొర్లుచు సుశీల స్థితినిచూడగనే అతని హృదయము పగిలి "నే నేరీతిగా సుశీలను వోదార్చగలను" అని చింతించుచు దుప్పటి నిండుగా కప్పుకొని తనలోతా నేడువసాగెను.

౨

మోహనునకు మనస్సు స్థిమితములేదు. ఇంటి యందు తన సోదరి, తాను పడు కష్టములను బాపు కొనుటకై అనేక విధముల ప్రయత్నము చేయు చుండెను తా నెక్కడనైన చిన్నఉద్యోగము సంపాదించిన, చెల్లెలు, తాను వేరుగా వుండవచ్చుననియెడి ఆశతో ఎంతప్రయత్నించి, ఎక్కడకు వెళ్ళినను "లేద"ను శబ్దమే ఎదురువచ్చు చుండెను. తిరిగి తిరిగి వేసారి ఆలోచించగా మోహనునకు క్రిష్టియన్ మతమే శ్రేష్ట ముగా కనుపించెను. ఆ మతము పుచ్చుకొనిన, ఏ మాష్టరుపనియో యిచ్చి నెలకు ఇరువది రూప్యములైనను ఇచ్చెదరు. దానితోడ యిద్దరి జీవనము హాయిగ గడపు కొనవచ్చుననియు, మరల జీతముకొరకు ఆశపడి జాతి భ్రష్టుడనై తరతరములనుండి ఖ్యాతిగన్న స్వచ్ఛమగు జాతికంతకు కళంక మాపాదించుటయా? లేక జాతి రక్షణకై పడరాని పాట్లు పడుచు, వినరాని మాటలు వినుచు జీవన్మృతుడనై యుండుటయా? లేదు తుచ్ఛ డగు నాబోటి మానవు డొకడు అన్యజాతియందు కల సిన పవిత్రమగు నాజాతికివచ్చిన కళంకము ఏమాత్రము లేదు. రేపటిదినమున ఫాదిరిగారిని కలసుకొనవల యును' అని తర్కవితర్కములలో మునిగియున్న మోహనునకు, నీకు జయముకలుగుగాక అనునట్లు చేరువనున్న 'చర్చి'లోని గంట చప్పుడు వినవచ్చుటయు' వెంటనే అందు గలవారు చేయుప్రార్థనయు వినరాగా నేడు ఆదివారము కాబోలు ననుకొనుచు మోహన్ మరల దీర్ఘాలోచనా నిమగ్నుడయ్యెను. కొంత సేప టికి మబ్బులు గాఢముగా క్రమ్మి ఉరుములు మెరపులు ప్రారంభించి మోహనుని ఆలోచననుండి మేలుకొల్పెను. ఊరిబయటనున్న ఒక పాతవంతెనపై కూర్చునియున్న మోహన్ నెమ్మదిగాలేచి ఇంటివైపు వెడలిపోయెను.

౩

సంధిగ్ధావస్థయందుబడి మోహన్ ఏమిచేయు టకు పాలుపోక పిచ్చివానివలె కొట్టుకొనుచుండెను.

ఒకనాటి సాయంకాలమున మోహన్ నెమ్మ దిగా ఫాదిరి రెవరెండు స్మిత్ బంగళా వైపునకు వెళ్ళి గేటుతెరచి మెల్లగ బంగళాలోనికి వెళ్ళసాగెను. అంతలోనే ఒక సీమకుక్క మొరగుచు మోహన్ పైబడ నుంకించుచుండగా "లిల్లీ! కమాన్—లిల్లీ! కమాన్" అనుచు ఒక యువతివచ్చి కుక్కను పట్టు కొనెను.

"లిల్లీ కరువదు. మీరు లోనికి రావచ్చును." అని చీరను సవరించుకొనుచు ఆయువతి పలికెను.

ఆమెను చూచుటయే తడవుగ మోహనుడు విభ్రాంతుడయ్యెను. ఆమె మధురములగు పలుకులు అతని హృదయమునందు మారుమ్రోగు చుండెను. లిల్లీ ముఖము పైకెత్తి అతనివంక చూచుచుండెను.

మోహన్ భావపూరితములగు క్రీగంటి చూపుల నామెపై ప్రసరింపజేయుచు, మనస్సు దిటవుపరచుకొని —"స్మిత్ గారు వున్నారా?" అని అడిగెను. ఆయువతి పయ్యెదను సవరించుచు లిల్లీని ఒడిలోనికి తీసుకొని— "వారు మిసెస్ స్మిత్ తో గూడ బయటకు వెళ్ళినారు. ఇప్పుడే రావచ్చును. మీరు వారిరాకకై, హాలులో కూర్చుండ వచ్చును" అని హాలులోనికి వెళ్ళెను.

మోహన్ మంత్రముగ్ధునివలె ఆమె వెనుకనే వెళ్లి హాలులో సోఫాపై మౌనముగా కూర్చుండెను. మోహన్, దగ్గర టేబిల్ మీదనున్న "శాంతి" పత్రికను తిరగవైచుచు క్రీగంటి చూపులతో యువతిని చూడ సాగెను.

యువతి లిల్లీని ఒడిలో కూర్చుండబెట్టుకొన్న గోధుమ రంగుగల పొడవగు అక్కుటిక కేశములను దువ్వుచు వాలుచూపులతో మోహనుని వీక్షింపసాగెను. యిరువురును ఒకరినొకరు సమయము దొరకించుకొని చూచుకొనుచుండిరి.

మోహన్—"మీరిక్కడ మిష్టర్ స్మిత్ గారితో ఉంటున్నారా?"

"అవును, మీరేమి చేయుచున్నారు? చదువుచున్నారా? అని నెమ్మదిగ యువతి అడిగెను. దీర్ఘమగు నిట్టూర్పు విడచుచు—"అవును, ఎమ్.ఎ. వరకు చదివి, యిప్పుడు ఉద్యోగముకొరకు ప్రయత్నముచేయుచున్నా"నని మోహన్ చెప్పెను.

ఇరువురకును ఒకరితోనొకరు మాట్లాడవలయునను కుతూహలము అధికమైనను ఏరీతి మరల సంభాషణ నుపక్రమింపవలయునా అని దీర్ఘముగా నాలోచింప సాగిరి. యువతి అధరములపై చిరునవ్వు చిందులాడ అర్ధనిమీలిత నేత్రయై ముద్దుమోముపై ముసరిన ముంగురులను సవరించుకొనుచు—"మీ రిక్కడకు వచ్చిన పనియేమి?"

మోహన్ సోఫాలోకూర్చొని ఎదుట కనబడు దివ్యమూర్తిని చూచుచు తన్మయుడైయున్నతరి యువతి అడిగిన ప్రశ్నకు మేల్కొంచి తడబడుచు— "స్మిత్ దొరగారిని చూడవచ్చితిని. నాసాహసమునకు మన్నింతురు గాక! మీరుచూడ హిందూయువతివలె కనుపించుచున్నారు. మీరు-"అని అడుగుచు మోహన్ ఆగెను.

"నిస్సందేహముగా-నా చిన్నతనమునందే ఎవరో నన్ను స్మిత్ దొరగారికి ఒప్పగించి వెళ్ళినట్లును, తదాది నేటివరకు మరల వారి జాడయే లేదనియు, దొరగారికి వేరు సంతానము లేనందున, నన్ను ప్రేమగా పెంచుకొనుచున్నట్లును అప్పుడప్పుడు మాటల సందర్భమున దొరగారివలన నేను వినియుంటిని. యిదియే నా జన్మ చరిత్ర" అని ప్రేమపూరితదృక్కులతో జవాబిచ్చెను. అగ్గలమగు ప్రేమ ప్రవాహమును అరికట్టుచు, పలుమార్లు ఆ యువతిని, లోలోన మెచ్చుకొనుచుండెను. "మీ పేరు?" అనెను ఆయువతి.

"మోహన్; మీ పేరు చెప్పెదరా?"

"ఉష"

"ఉష, ఎంత చక్కని పేరు."

తరువాత వారేమేమో సంభాషించుకొనుతరి మోహన్ బల్లమీద పుస్తకమునుండి ఒక ఫోటో క్రింద పడగా, మోహన్ దానిని తీసి అతి శ్రద్ధగా ఒకసారి ఫోటోవంకను, ఒకసారి ఉషవంకను చూచెను. ఉష చూచి, లేచివచ్చి, "ఆ ఫోటో యిటు తెండు"అని యనెను.

"ఇచ్చెదను, యిది మీ చిన్నతనమునదై యుండవచ్చు. అప్పటికిని యిప్పటికిని మీలో ఏమాత్రము మార్పులేదు".

"అవును, నాదే. ఇటు తెండు" అనుచు ఉష రెండడుగులు ముందునకు వైచి, మోహన్ చేతియం

దున్న ఫోటోను తీసికొనబోయి, మోహనుని హస్తమును తాకెను. ఇరువురిలో వొక చిన్న మార్పు. ఇరువురును తమ్ము తాము మరచి కొంతసేపు తొట్రుచాటు సంభాషణలను చేసిరి. ఆ సంభాషణ సమయమున బహుకాల పరిచయములున్నవారివలె యేమేమో మాటలాడిరి. కడకు ప్రేమవాక్కులు- యింతలోననే సిగ్గు— ప్రేమకొరకు మతము బలియిచ్చుట-మున్నగు మాటలు వచ్చినవి. ఇంతలో జోళ్ళ చప్పుడైనది. ఉష చఱున లోనికి వెళ్ళిపోయినది. స్మిత్ దొర లోనికి వచ్చెను. స్మిత్ దొర లోనికి వచ్చుటయే తడవుగ మోహన్ తోడ వందన కరస్పర్శాదులు గావించి, వచ్చినపని యేమి? అడుగ మోహన్, "ఉద్యోగము నిమిత్తము తమ దర్శనమునకు వచ్చితిని, తమ ఆఫీసులో ఏదైన ళీఖావున్నయడల దయచేసి నాకు ఇప్పించ కోరెదను" అనెను.

స్మిత్:-"అరే రే, ప్రస్తుతము మా ఆఫీసులో హిందువులకు ఇచ్చుటకు కాళీలు ఏమియు లేవే. కాని ఒక సీటు ఉన్నది. అది 'కన్వర్టెడ్' క్రిస్టియన్సుకైనను ఇవ్వవచ్చును. గాని మీ హిందువుల కిచ్చుటకు వీలులేదు. మంచి జీతము యిచ్చెదరు. పాపము ఇంత శ్రమతో వచ్చిన మీకు లేదని చెప్పుటకు చాలచింతించుచున్నాను. 'కన్వర్టెడ్ క్రిస్టియన్' పోస్టుకు మీరు ఇష్టపడిన ఇప్పించెదను. మంచి వేతనము కూడ వచ్చే ఏర్పాటు చేసెదను. మీరు బాగుగ అలోచించుకొనుడు" అనెను. మోహన్ తన చూపున నలుదిక్కుల ప్రసరింపజేయుచు గేటును సమీపించుతరి ఉష ప్రత్యక్షమై జాలి చూపులతో—"తీరిక కలిగినపుడు తరచు రాగోరెదను. మరువవలదు" అని నును సిగ్గుతో వచించెను.

"ఎన్నటికిని మరువజాలను. తప్పక వచ్చుచుండెదను. అని చెప్పుచున్నంతలో స్మిత్ 'ఉషా' యని పిలచినందున అదరిపడి తొందరగా ఉష లోనికి వెళ్ళెను. మోహన్ మందగమనముతో తిరిగితిరిగి చూచుచు మరల తనకు వాటిల్లిన నూతన సంఘటనను తలపోయుచు వెళ్లిపోయెను.

౪

'క్రిస్టియన్' మతధారణవలననేగాని ఉద్యోగము లభింపదని స్మిత్ దొర చెప్పియుండెను. అట్లు చేసిన ఉద్యోగము లభించుటయేగాక ఉష కూడ లభించును. నావలన అమాయికయగు సుశీల గూడ జాతిభ్రష్టయగును. నా సౌఖ్యమునకై ఆశపడి ఆమెను కళంకితజేయుదునా? అనుకొనుచు మోహన్ అప్పుడే వచ్చిన దైనిక పత్రిక చూచుచుండ, "కావలెను—కావలెను" శాంతి పత్రికకు ఒక 'సబ్ ఎడిటర్' పట్టభద్రుడయినచో మంచిది" అను ప్రకటననుగాంచి ఆలస్యము అమృతం విషమని తలచి వెంటనే దుస్తుల ధరించి పత్రికాలయమునకు వెళ్ళెను.

* * *

మోహన్ మరల రాకపోవుటకు కారణమేమిటాయనియు, నాటిదినము ఆయన అడ్రసుకూడ తెలుసుకొనలేనందుకు విచారించుచు, తదాది నేటివరకు మోహన్ జాడయే లేనందున ఉష దీర్ఘాలోచనలో దినమొక యుగముగా గడపుచుంచెను. తనకు అత్యంత ప్రియకరమగు 'పియానో'మీద కూడ కరము వైచుట లేదు.

ఒక దినమున మధ్యాహ్నము టీ తీసుకొని చల్లగాలికై ఉష వరండాలో పడకకుర్చీపై కూర్చున్నతరి 'పోస్టుమెన్' వచ్చి కొన్ని ఉత్తరములును 'శాంతి' పత్రికయును ఇచ్చి వెడిలిపోయెను. మనశ్శాంతికై ఆమె 'శాంతి' పత్రికను తిరుగవైచుచుండ, ఒక వ్యాసము క్రింద "మోహన్" అను పేరును చూచెను. ఆమె అదరిపడెను. సంతోషాక్రాంత యాయెను. పత్రికాధిపతి యొద్దకు వెళ్ళి మోహన్ అడ్రసును తెలుసుకొన బయలుదేరెను.

ఉష:-"అయ్యా, మీ పత్రికయందు అన్యమతస్వీకారమను వ్యాసము వ్రాసినవారి అడ్రసును తెలుపగలరా?"

ఎడిటర్:- "ఓహో, వారా? ఆయన వచ్చెడి సమయము అయినది. ఇప్పుడే ఇచ్చటకు రాగలరు" అని చెప్పుచున్నంతలో మోహన్ ప్రవేసించి "ఉషా, ఉషా, ఇది ఏమి ఇట్లు వచ్చితివి" అని సంతోషస్వాంతుడై అడుగుచు, తనవద్దనున్న కాగితములను ఎడిటరుగారికి ఇచ్చి ఉషతో గూడ బయలుదేరి ఇంటికి వెళ్ళెను.

※

"సుశీ! సుశీ!! ఉష వచ్చినది చూచితివా" యని, యిరువురకు పరిచయము కలిగించెను. సుశీల వచ్చి సంతోషముతో ఉషను లోనికి తీసికొని వెళ్ళెను.

మోహన్:-ఉషా, నిర్ణయించుకొనిన రీతిగ నేను రాకపోవుటయేగాక, నీకు ఇంత శ్రమ గల్గించినందులకు నన్ను క్షమించుము.

"మిమ్ములను క్షమించుటయా?"

"అవును, ఏదైన ఒక ఉద్యోగము సంపాదించిననేగాని మరల నీవద్దకు రాకూడదని తలచితిని. భగవదనుగ్రహమువలన మొన్ననే శాంతి పత్రికకు సబ్ ఎడిటరు ఉద్యోగము లభించినది. నెలకు ఎనుబది రూప్యములు యిచ్చుచున్నారు. ఇదియంతయు నీ భాగ్యమువలన లభించినదియే. దీనితోడ మనము ముగ్గురము హాయిగా కాలము గడుపవచ్చును" అని మందహాసముతో మోహన్ చెప్పెను.

"నిజముగ నాభాగ్యమే! మీవంటి ఉత్తమ పురుషులను బడయుటచే ధన్యురాలను.

*　　*　　*

ఆ మరునాడు దైనికపత్రికయందు ఉషా మోహనుల వివాహము ఆర్యసమాజ విధులప్రకారము అత్యంత వైభవముతో జరిగెననియు, దైవజ్ఞానపిళ్లెగారు పౌరోహిత్యము వహించిరనియు ఆ వివాహ వివరములు ప్రకటింపబడెను.


## జగదేకరంభ

జగదేకరంభయన నీమెయే జగదేకరంభ. రంభఅంటే దేహసౌందర్యముచేతనేగాక శీలసౌందర్యముచే ప్రపంచాన్ని మెప్పించిన నారీరత్నము. చమత్కారమైన కథ.

గ్లేసు ప్రతి 1-కి 0-10-0　　తపాలాఖర్చు వేరు:

## మిత్రద్రోహము

తిన్నయింటికి వాసాలెంచు సామెతనుబట్టి యల్లబడిన రసవంతమగు నవల. ఇదివర కిట్టి నవల వెలువడలేదు. అపరాధాన్వేషణము అత్యద్భుతము. గ్లేసు ప్రతి 1-కి 0-8-0

తపాలాఖర్చు ప్రత్యేకము.

ధనలక్ష్మి కంపెని,
సౌకారుపేట,　　మదరాసు.

## లీలా

లేక

## సురేంద్రనగరమణి

రసవంతమగు నవలారాజము

బాలురకు తలితండ్రులయందు భక్తియు, స్త్రీలకు పతియందలి ప్రేమయు, పురుషులకు రాజవిశ్వాసమును యీ గ్రంథపఠనచే యలవడును.

ప్రతి 1-కి రు. 1-0-0

ఆర్యన్ బుక్ డిపో,
19, తాండవరాయ మొదలివీధి, తిరువళ్ళిక్కేణి, మదరాసు.